# సీసీఆర్ ద్వారా పోలింగ్ పర్యవేక్షిస్తాం

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి
- జిల్లాలోని డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల పరిశీలన



డిస్ట్రిబ్యూషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న డీఈవో, కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టరేట్, నవంబర్ 29: కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా జిల్లాలోని నాలుగు అసెంబ్లీ సెగ్మెంట్లలో జరిగే పోలింగ్‌ను నిరంతరం పర్యవేక్షించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. పోలింగ్ నిర్వహణకు సంబంధించి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను బుధవారం ఆమె తనిఖీ చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సాధారణ ఎన్నికల నిర్వహణపై తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలపై సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేశారు. ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలు, ఓటింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. పంపిణీ కేంద్రాల ద్వారా ఎన్నికల సామగ్రి పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది, అధికారులకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. జిల్లా ఎన్నికల అధికారి వెంట కరీంనగర్, చొప్పదండి, మానకొండూర్, హుజూరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు మహేశ్వర్, ప్రపుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, రాజు, ఎన్నికల విభాగం సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# పోలింగ్ కేంద్రాలకు నిరంతర విద్యుత్

- సర్కిల్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు
- ఎస్ఈ వీ గంగాధర్

ముకరంపుర, నవంబర్ 29: శాసనసభ ఎన్నికల నేపథ్యంలో కరీంనగర్ సర్కిల్ పరిధిలో విద్యుత్ సరఫరాకు ఇబ్బంది లేకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎక్కడ ఏ సమస్య తలెత్తినా క్షణాల్లోనే పరిష్కరించేలా అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉన్నారు. ఈ మేరకు సెక్షన్ కేంద్రాల్లోనే అంతా అందుబాటులో ఉండాలని ఎస్ఈ వీ గంగాధర్ అధికారులు, సిబ్బంది ఆదేశించారు. ఈ మేరకు పోలింగ్ కేంద్రాల్లో సరఫరా తీరును బుధవారం ఎస్ఈ పరిశీలించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు ముందస్తు చర్యలు చేపట్టారు. ఏదైనా పోలింగ్ కేంద్రం పరిధిలో సరఫరాకు ఇబ్బంది ఏర్పడితే అధికారులు, సిబ్బందిని సమన్వయం చేస్తూ, సత్వరమే పరిష్కరించేలా సర్కిల్ కార్యాలయంలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. కంట్రోల్ రూంలకు నంబర్లు 94408 11444, 94408 11392 కేటాయించారు. గురువారం ఉదయం 6 నుంచి శుక్రవారం ఉదయం 6 గంటల వరకు ముగ్గురు డీఈలతో



ఆరెపల్లి పోలింగ్ కేంద్రంలో విద్యుత్ సరఫరా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్ఈ గంగాధర్

పాటు ఇతర అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండి విద్యుత్ సరఫరాను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారని ఎస్ఈ తెలిపారు.

# ఎన్నికల నిర్వహణకు పటిష్ట భద్రత

- క్రిటికల్ పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు భద్రత
- ఎస్పీ అఖిల్ మహాజన్



సిరిసిల్లలో ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్, పక్కన అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

తెలంగాణ చౌక్, నవంబర్ 29: జిల్లాలో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగే విధంగా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టామని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈవీఎంల పంపిణీ కార్యాక్రమాన్ని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌తో కలిసి సందర్శించారు. అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో స్వేచ్ఛాయుత వాతావరణంలో పోలింగ్ జరిగేలా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా 560 పోలింగ్ కేంద్రాల్లో 1700 మందికిపైగా భద్రతా సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని వెల్లడించారు. పోలీస్ స్టేషన్లలోని ఈవీఎంలు, ఎన్నికల సామగ్రిని పోలింగ్ పూర్తయిన తరువాత తిరిగిపంపే వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో విధులునిర్వహించే ప్రిసైడింగ్ అధికారి అనుమతి లేనిది పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లరాదని తెలిపారు. ఓటు హక్కు వినియోగించుకోవడానికి వచ్చే ఓటర్లు, పోలింగ్ ఏజెంట్ల వద్ద అగ్గిపెట్టెలు, నీళ్లబాటిళ్లు, సెల్‌ఫోన్ తదితర వస్తువులు ఉండకుండా చూడాలన్నారు. ముఖ్యంగా దివ్యాంగులు, వృద్ధులు, గర్భిణులు, చంటిపిల్లల తల్లులు, ఓటు వేయడానికి వచ్చే సమయంలో వీలైనంత త్వరగా ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఏదైనా అనుకోని ఘటనలు జరిగే అవకాశం ఉంటే వెంటనే మొబైల్ పార్టీకి సమాచారం అందించాలని సూచించారు. రూట్ మొబైల్ పార్టీలు ఈవీఎంలకు ఎస్కార్ట్‌గా ఉండి పంపిణీ కేంద్రం నుంచి పోలింగ్ స్టేషన్‌కు చేర్చి, తిరిగి పోలింగ్ పూర్తయిన తర్వాత తీసుకొని డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో అప్పగించే వరకు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాలను కలుపుతూ ఉన్న రూట్లు, కేంద్రాల వద్ద గుంపులు ఉండకుండా చూడాలన్నారు. పోలింగ్ స్టేషన్ చుట్టుపక్కల 100 గజాల వరకు ఏ రాజకీయ పార్టీకి సంబంధించిన బ్యానర్లు, పోస్టర్లు లేకుండా చూడాలని తెలిపారు. ఓటర్లను ప్రైవేట్ వాహనాలు, ఆటోలు, జీపులు, కార్లలో తరలించకుండా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ ఉదయ్‌రెడ్డి, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ఉత్తమ సేవలకు పురస్కారాలు

కలెక్టరేట్, నవంబర్ 29: విధి నిర్వహణలో అత్యుత్తమ సేవలందించిన వారికి తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో ప్రగతి చక్ర పురస్కారాలను ప్రతి సంవత్సరం అందిస్తున్నట్లు రీజినల్ మేనేజర్ వీ సుచరిత తెలిపారు. బుధవారం సిరిసిల్ల డిపో మేనేజర్ మనోహర్ ఆధ్వర్యంలో ప్రగతి చక్ర అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్ఎం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కరీంనగర్ రీజియన్ పరిధిలోలో సిరిసిల్ల డిపో రెండో స్థానంలో నిలిచినందున ప్రగతి చక్ర అవార్డులు ప్రదానం చేసినట్లు తెలిపారు.



మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్, పక్కన కార్పొరేటర్ భూమాగౌడ్, కలర్ సత్తన్న

# గౌడ సమాజానికి బండి సంజయ్ క్షమాపణ చెప్పాలి

తెలంగాణచౌక్, నవంబర్ 29: కొత్తపల్లి పట్టణంలో మంగళవారం రాత్రి బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ అకారణంగా మహిళా ప్రతినిధి భర్త గున్నాల రమేశ్ గౌడ్ పై దాడి చేయడం పట్ల జిల్లా గౌడ సంఘం నాయకులు మండిపడ్డారు. ఓటమి భయంతోనే బండి సంజయ్ దాడులకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. నగరంలోని జిల్లా గౌడ సంఘ కార్యాలయంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్ గౌడ్, కార్పొరేటర్ భూమాగౌడ్, గౌడ సంఘం నాయకుడు కలర్ సత్తన్న బుధవారం విలేకరులతో మాట్లాడారు. రమేశ్ గౌడ్‌పై దాడికి పాల్పడిన బండి సంజయ్ గౌడ కులస్థులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగితే ఓడిపోతామనే భయంతో తన అనుచరులను అల్లర్లకు ఉసిగొల్పుతున్నాడని విమర్శించారు. రమేశ్ గౌడ్‌పై దాడిని ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. బండి సంజయ్‌కి గుణపాఠం చెప్పాలని గౌడ కులస్తులకు పిలుపునిచ్చారు. జిల్లా గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా దీక్షా దివస్

సిరిసిల్ల టౌన్, నవంబర్ 29: జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి ఆధ్వర్యంలో బుధవారం దీక్షా దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి నాయకులు పాలాభిషేకం చేశారు. అంతకుముందు అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను ఫణంగా పెట్టిన కేసీఆర్ దీక్షతో తెలంగాణ సమాజం ఉద్యమంలో ఏకతాటిపైకి వచ్చిందన్నారు. ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన మహనీయుడు సీఎం కేసీఆర్ చేపట్టిన దీక్షా దివస్‌ను నేడు జరుపుకోవడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నేత చీటి నర్సింగరావు, టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

***గంభీరావుపేటలో..***

గంభీరావుపేట, నవంబర్ 29: మండల కేంద్రంలో సీఎం కేసీఆర్ దీక్షా దివస్‌ను బుధవారం బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాపాగారి వెంకటస్వామిగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్ప ఫలితంగానే నేడు పేదలకు సంక్షేమ పథకాలకు అందుతున్నాయని చెప్పారు. దీక్షా దివస్‌ను పురస్కరించుకుని మా అనాథ ఆశ్రమంలో వృద్ధులకు పండ్లు, బ్రెడ్‌ను అందించారు. అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తున్న సీఎం కేసీఆర్‌పై ఆశీస్సులు ఉండాలని వెంకటస్వామిగౌడ్ వృద్ధులను కోరారు. కార్యక్రమంలో పటణాధ్యక్షుడు పెద్దవేని వెంకటియాదవ్, నేతలు లక్కిరెడ్డి కమలాకర్‌రెడ్డి, పిట్ల శ్రీమతి తదితరులు ఉన్నారు.

# కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్



కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన డిజిటల్ తెరలను పరిశీలిస్తున్న అధికారులు

కలెక్టరేట్, నవంబర్ 29: సిరిసిల్ల సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఎన్నికల వెబ్ కాస్టింగ్ కమాండ్ కంట్రోల్ రూమ్‌ను బుధవారం రాత్రి ఎన్నికల సాధారణ పరిశీలకుడు డాక్టర్ జగదీశ్ సోన్‌కర్, ఎన్నికల పోలీసు పరిశీలకురాలు వినీతాసాహు, ఎన్నికల వ్యయ పరిశీలకుడు మణిగండసామి, కలెక్టర్ అనురాగ్ జయంతి పరిశీలించారు. వేములవాడ, సిరిసిల్ల నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రక్రియ వెబ్‌కాస్టింగ్‌ను పరిశీలించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రెండు పెద్ద డిజిటల్ తెరలను వీక్షించారు.

## పోలింగ్ కేంద్రాలకు చేరిన సిబ్బంది

వీర్నపల్లి, నవంబర్ 29: మండలంలోని అన్ని గ్రామాల పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది సామాగ్రితో బుధవారం సాయంత్రం చేరుకున్నారు. జిల్లా కేంద్రంలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి కేంద్ర బలగాల భద్రత మధ్య ప్రత్యేక వాహనాల్లో సిబ్బందిని తరలించారు. సీతారాం నాయక్‌తండా పోలింగ్ కేంద్రానికి చేరుకోవడానికి ఎన్నికల సిబ్బంది సామగ్రితో కిలోమీటర్ వరకు కాలినడకన నడిచి వెళ్లారు. మండలంలో 16 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు సెక్టోరియల్ ఆఫీసర్ నరేశ్‌కుమార్ తెలిపారు.